క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలని నిరసన


పరవాడలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పరవాడలోని పని ప్రదేశంలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. గనిశెట్టి మాట్లాడుతూ మండలంలో ఉపాధి కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. బకాయి వేతనాలు చెల్లించని నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు రొంగలి రమణమ్మ, గండి లక్ష్మి, బి.సన్యాసమ్మ, వర్రి కుమారి, ఊర్మిళ పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి

కూర్మన్నపాలెం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వరంగ పరిశ్రమల వల్ల ఆర్థికాభివృద్ధి విస్తరించిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాలనుకోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 722వ రోజు టీపీపీ ,ఆర్‌ఈడీ, పీఈఎం విభాగ కార్మికులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, బి.మహేష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాల న్నారు. ఈ ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శిబిరంలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాఘపౌర్ణమి పూజలకు వేళాయె

ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు


తీరం సమీపంలో కొలువుదీరిన శ్రీ మాధవస్వామి


ముత్యాలమ్మపాలెంలో స్నానాలకు అనువైన విశాలమైన సముద్ర తీరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో మాఘపౌర్ణమి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా తీర ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. మాఘపౌర్ణమి పురస్కరించుకుని భక్తులు శనివారం రాత్రింతా జాగరణ చేసి ఆదివారం సూర్యోదయాన సముద్ర స్నానాలు ఆచరించి సమీపంలో కొలువుదీరిన శ్రీ మాధవస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయం ముస్తాబు

తీర్థ మహోత్సవంలో భాగంగా మాధవస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించారు. గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. జాగరణ చేసే భక్తుల కోసం తీరంలో శనివారం రాత్రికి మాధవస్వామి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సహకారంతో విశాఖ డ్యాన్స్‌బేబీడాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. `అదే రాత్రి టీడీపీ సహకారంతో డ్యాన్స్ ధమాకా కార్యక్రమం నిర్వహించనున్నారు. `ముత్యబంగారమ్మ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో బుర్రకథ ఏర్పాటు చేశారు. `ఆదివారం ఉదయం స్నానాల ఘట్టాల వద్ద గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు సహకారంతో డ్యాన్స్ ధమాకా కార్యక్రమం నిర్వహించనున్నారు.

- సుదూర ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలపడానికి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- భక్తులకు మంచినీరు, ఉచిత ప్రసాదాలు అందించనున్నారు.

పటిష్ట బందోబస్తు


పి.ఈశ్వరరావు, సీఐ, పరవాడ

పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి సముద్ర స్నానాలకు వచ్చే భక్తుల కోసం స్టీల్‌సిటీ డిపో నుంచి అదనపు సిటీ బస్సులు నడపడానికి ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. స్నాన ఘట్టాల వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు చెప్పారు. మాఘపౌర్ణమిలో భాగంగా తీరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని సీఐ తెలిపారు. మహిళా భక్తుల కోసం తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మైలపల్లి రాజయ్య తెలిపారు.

అండర్‌పాత్‌లు నిర్మించాలని ధర్నా


గుల్లేపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గజ్జివాని చెరువు ఆయకట్టు రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు గుల్లేపల్లి పంచాయతీ పరిధిలో 60 ఎకరాల భూమిని సుమారు 150 మంది వరకూ రైతులు ఇచ్చారని పేర్కొన్నారు. భూ సేకరణలో భాగంగా రైతుల అభిప్రాయాల సేకరణకు అధికారులు ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో తమ పొలాల్లో పండిన పంటలను తరలించేందుకు అండర్ బ్రిడ్జి నిర్మించాలని, సాగునీటి చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే కాలువ నిర్మించాలని కోరడం జరిగిందన్నారు. దీనికి అప్పట్లో భూ సేకరణ అధికారులు అంగీకరించారన్నారు. ఇప్పుడు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారని రైతులు వాపోయారు. తమ సమస్య పరిష్కరించకపోతే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల్లో పండే పంటలను తెచ్చుకునే మార్గం లేక నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. నిరసన తెలియజేసిన రైతులు ఉప్పిలి దుర్గారావు,బందం నరసింహమూర్తి,బందం లక్ష్మణ,పల్ల శ్రీరాములు,గండి ఎర్రినాయుడు,సింగంపల్లి నరసయ్య,సింగంపల్లి సింహచలం,బందం పోతన్న,బందం అప్పలస్వామి,గొంప రామునాయుడు తదితరులు ఉన్నారు.

వెంకన్న ఆలయంలో పండిత సదస్సు


సదస్సులో పాల్గొన్న పండితులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం రాత్రి పండిత సదస్సు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి మండపంలో వేంచేయజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పండితులు తమ పాండిత్యంతో స్వామివారిని కీర్తించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గడప గడపలోనూ అదే ఆదరణ


97వ వార్డులో మహిళకు ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: నియోజక వర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తామెంతో లబ్ధి పొందుతున్నామని ప్రజలు చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. 97వ వార్డులోని 496 సచివాలయం పరిధిలో ఉన్న సుజాతానగర్, టీచర్స్ లేఅవుట్‌లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ధైర్యంగా తిరుగుతున్నామంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలు వలే అని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, కన్వీనర్లు నాగమణి, మహేష్, సోమునాయుడు, పార్టీ నాయకులు రాంబాబు, వర్మ,ఈశ్వరరావు, దారప్ప, కొత్తపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

సీసీ డ్రైన్లు నిర్మించాలి


మట్టి కాలువ ద్వారా ప్రవహిస్తున్న మురుగు నీరు

పరవాడ: దేశపాత్రునిపాలెం-జాజులవానిపాలెం వరకు సీసీ కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు నీరు ప్రధాన రోడ్డు సమీపం నుంచి ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి సీసీ కాలువ సచివాలయం-2 వరకే నిర్మించారు. మిగిలిన మట్టి కాలువను సీసీ కాలువగా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం మురుగు నీరు మట్టి కాలువ ద్వారా ప్రవహిస్తోంది. కాలువ నుంచి పారుతున్న మురుగు నీరు దుర్వాసన వెదజల్లడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని.. అసంపూర్తిగా ఉన్న సీసీ కాలువను పూర్తి చేయడానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు సింహాచలంతో అనుబంధం

సింహాచలం: కళా తపస్వి కె. విశ్వనాథ్‌కు సింహాచలంతో అనుబంధం ఉంది. సింహాచలం దేవస్థానంలో ప్రధానార్చకుడిగా పనిచేసిన దివంగత కె.కె.రామానుజస్వామి(అప్పబాబు)తో ఆయనకు పరిచయం ఉండేది. దీంతో ఆయన ఇంటికి విశ్వనాథ్ పలుమార్లు వచ్చారు. 1988లో వెంకటేష్‌తో తెరకెక్కించిన స్వర్ణకమలం సినిమా షూటింగ్ వైజాగ్‌లో చేస్తున్న సమయంలో కూడా కె.కె.రామానుజస్వామి ఇంటికి వచ్చారు. ఆసినిమాలో కె.కె.రామానుజస్వామి కూడా అతిథిపాత్రలో నటించారు. అలాగే విశ్వనాథ్ దర్శకత్వం వహించిన పలు సినిమాల్లో సింహాచలానికే చెందిన మిశ్రో కూడా నటించారు.

పరవాడలో కుక్కల బెడద


పరవాడలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో వీధి కుక్కల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులు సంచరిస్తున్న గ్రామ సింహాలతో ప్రజలు గుమ్మం దాటి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్లు, బజార్లు, మాంసం, చేపల దుకాణాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ కుక్కలు విచ్చల విడిగా సంచరించడంతో మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పరవాడ సంతబయలు, శ్మశాన వాటిక ప్రాంతాల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ ప్రయాణికులను భయపెడుతున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకుల వెంటపడడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. సినిమాహాలు కూడలిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో నిత్యం కుక్క కాట్లతో పలువురు గాయాలపాలవుతున్నారు. వీధి కుక్కల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, ద్విచక్ర వాహనదారులు


ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న సీఐ అశోక్‌కుమార్, వాహనదారులు

సింహాచలం: ద్విచక్ర వాహనదారులు వాహనాన్ని నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పెందుర్తి నుంచి వేపగుంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. సిగ్నల్ క్రాసింగ్, అతివేగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

అలివేలు మంగమ్మా.. చల్లగ చూడమ్మా..


శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


జలాధివాసం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

- విశేషంగా శాంతి కల్యాణం
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

సింహాచలం: చినముషిడివాడలోని అలిమేలు మంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న తూర్పు, ఉత్తర రాజగోపురాల ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాంతి కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి ఈ కార్యక్రమం చేపట్టారు. వేదికపై ఉత్సవమూర్తులను అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉదయం నుంచి కుంభావాహన, అగ్నిప్రతిష్ట, విశేష హోమాలు, జలాధివాసం, రుత్విక్ సన్మానం చేశారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు పూజలను నిర్వహించారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు


గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్. విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహర్‌దగా, లతేహర్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కై లాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏడీ పాల్, సభ్యులు సంతోష్‌కుమార్, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాపు..

ఫెస్టివల్‌లో భాగంగా ఫిల్మ్‌మేకింగ్‌పై 7న ఉదయం 10 గంటలకు పౌరగ్రంథాలయంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య (మనసంతా నువ్వే ఫేం) వర్క్‌షాప్ నిర్వహించనున్నారని నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు 18ఏళ్లు దాటిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9441571581, 9032477463 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

- వర్సిటీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించాలి
- ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్-2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అంతా సాంకేతిక విప్లవం, సవాళ్లకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా యువతరం తమను తాము మెరుగుపరచుకోవాలని సూచించారు. ఏయూలో స్కూల్స్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని స్కూల్‌గా మార్చు చేస్తామన్నారు. నూతనంగా ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి, స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సింహపురి వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు, చార్టెడ్ అకౌంటెంట్ ఆకుల చంద్రశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య డి.ప్రభాకరరావు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కేశాల విరాళం అభినందనీయం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


క్యాన్సర్ రోగులకు కేశాల విరాళం ఇచ్చిన వారితో మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కేశాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో కేశాల విరాళ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు నగరానికి చెందిన కొందరు మహిళలు వారి కేశాలు విరాళంగా అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతో ఉండాలని.. అలాంటప్పుడే వ్యాధిని అధిగమించగలరన్నారు. హెచ్‌సీజీ అంకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం


మాట్లాడుతున్న కె.ఎస్.మల్లేశ్వరి

కూర్మన్నపాలెం : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ముఖ్య లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లేశ్వరి అన్నారు. శని,ఆదివారాల్లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో ఉక్కు నగరం సమీపంలోని దేశపాత్రునిపాలెం సంస్కృతి గ్లోబల్ హైస్కూల్‌లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పాటు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ వేదికలో రెండు తెలుగు రాష్ట్రాల రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు మమత, సత్య, గోపి మాట్లాడుతూ వ్యాసం, కథ, కవిత్వం, పాట, ప్రక్రియలపై విద్యార్థుల మనోభావాలను పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త మానస ఎండ్లూరి, ఏపీటీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటపతిరాజు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కథా రచయిత దగ్గుబాటి పద్మాకర్, చిన్నపిల్లల కథా రచయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.